# మా రాధ కథ

రాధకి పెళ్ళయింది. మొగుడు రాజయ్య ఏదో సినిమాహాలులో పనిచేస్తున్నాడు నెలకి నూటయాభై రూపాయలు జీతం. బాగానే ఉందనుకుని సంతోషించాను. నేనే కాదు, మా ఇంటిలో వాళ్లూ మాయింటి కొచ్చేవాళ్ళూ. రాధని తెలిసిన వాళ్లంతా ఆమాటే అన్నారు. '

'రాధకేం మమ్మీ ! హాయిగా మొగుడు సినిమాలకి తీసుకెళుతూ ఉంటాడు.. ఫ్రీ.. కదా" అంటూ ఏడిపించారు పిల్లలు. వారిలా అంటున్నప్పుడల్లా సిగ్గుపడిపోయేది అది. అదలా సిగ్గుపడుతూ వుంటే చెప్పద్దూ, నాకూ ఏడిపించాలనే వుండేది. నేను ఆమాట అనేసరికి, దాని మొహం ఎరుపెక్కిపోయేది నాకేసి చూట్టానికి సిగ్గుపడి, తల ప్రక్కకు తిప్పుకునేది.

రాధ వెళ్ళిపోయాక నాకు చెయ్యి విరిగినట్లనిపించింది. ఏ పని చేసినా, అదే జ్ఞాపకం వచ్చేది. దాన్ని తలుచుకోని క్షణంలేదు. నేనేదైనా పనిచేద్దామని వెళితే నా చేతిలోని పని లాక్కుని అది చేసేది. దానికి రాని పనంటూ లేదు. మహాపనిమంతురాలు. అస్తమానం దాన్ని చూసి అనుకునేదాన్ని - 'రాధ ఎవరింటిలో పడుతుందో కాని, వాళ్ళు చాలా అదృష్టవంతులు అని."

*　　　　*　　　　*

రాధ మాయింటికొచ్చినప్పుడు దానికి పదేళ్ళుంటాయి. వాళ్ళ నాన్న మల్లయ్య మావారి ఆఫీసులో అటెండరుగా పనిచేసేవాడు. హఠాత్తుగా గుండెజబ్బొచ్చి మంచం పట్టాడు. ఇల్లు గడవడం కష్టమైపోయింది.

భార్య చంద్రమ్మ ఒకళ్ళింట్లో నౌఖరీకి కుదిరింది. ఎనిమిదేళ్ల కొడుకుని పెట్రోల్ బంకులో కుదిర్చారు మావారు. రాధని మా ఇంట్లోనే వుండమన్నాను. ఆదివారాలు మాత్రం వాళ్ళింటికెళ్ళి వస్తూ వుండేది.

రాధని పనిలోకి పెట్టుకున్నప్పుడు, 'ఇది పనిచెయ్యగలదా?' అనుకున్నాను. పిల్లల్ని స్కూల్లో దింపడం, తీసుకురావడం, అన్నం పట్టుకెళ్లడం, పిల్లల బట్టలుతకడం, చిన్నచిన్న బజారు పనులు వగైరాలు. సరే కానీలే నేర్పించి చూద్దాం అనుకుని రాజీపడ్డాను.

ఆరోజు నేను పడుకున్నాను. గణగణమని టెలిఫోను మోగింది. విసుక్కుంటూ లేవబోయాను - నిద్రచెడగొట్టిన ప్రబుద్ధులెవరా అనుకుంటూ. అంతలో "హల్లో..షి. ఈజ్.. స్లీపింగ్..రింగ్..ఆఫ్.. ఆఫ్టర్...పమ్..టైమ్" అని చెబుతున్న రాధకేసి చూస్తూ ఉండిపోయాను ఆశ్చర్యంతో. నేను విన్నానని తెలిసి మహా సిగ్గుపడిపోయింది రాద.

"ఎప్పుడు నేర్చుకున్నావే ఇంగ్లీషు?" ఆశ్చర్యంలోంచి తేరుకుని అడితాను. నవ్వుతూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అలా ఇంగ్లీషులో చిన్నచిన్న వాక్యాలు మాట్లాడటం నేర్చుకుంది రాధ. అది మాట్లాడుతుంటే మా యింటిల్లిపాదీ ఆనందించేవారు. బహుశ దానికది ప్రోత్సాహంగా వుండేదేమో. మెల్లమెల్లగా ఏబీసీడీలు వ్రాయడం నేర్చుకుంది.

'రింగర్.. రింగర్...రోజెస్..' అంటూ పిల్లలతోపాటు ఆడేది. ఇలా దాని తెలివితేటలు నానాటికీ వికసించాయి.

పైగా అది మాతోపాటు ఎక్కడికెళితే అక్కడికి వచ్చేది. మేము మాట్లాడుతుంటే వినడంవల్ల ఒక రకమైన సంస్కారం కూడా అబ్బింది దానికి. అనవసరంగా మాట్లాడేది కాదు.

మా పిల్లలకి పనికిరావనుకునే పరికిణీలూ అవీ దానికిచ్చేదాన్ని కాబట్టి దాని వేషభాషలు రెండూ ఇంపుగానే వుండేవి. ఒకసారి అదినాతో మద్రాస్ వచ్చింది. పిల్లలతోపాటు ఆడుకుంటున్న దాన్ని చూసి ఎవరో "ఇది మీ పెద్దమ్మాయా?" అని అడిగారు నన్ను. కొంచెం తడబడ్డా, వెంటనే "అవును" అన్నాను. ఆ మాట విన్న రాధ నాకేసి చేసి నవ్వింది. ఆ కళ్లలో తృప్తి తళుక్కున మెరుస్తూ కనిపించింది నాకు.

అటువంటి రాధ పెళ్ళయి వెళ్ళిపోతూ వుంటే, మా యింటిల్లిపాదికీ కళ్లల్లో నీళ్ళే తిరిగాయి. నాకేదో నా కూతుర్ని అత్తారింటికి పంపిస్తున్నట్టే అనిపించింది. అందరం పెళ్లికి వెళ్లాము. దాని సంసారానికి కావలసిన గిన్నెలోవో కొనిచ్చాను. ఒక మంచి చీరకూడా దానికి బొట్టుపెట్టి ఇచ్చాను. నేను వచ్చేస్తుంటే దాని కళ్ళలో నీళ్ళు నిండాయి. కనుమరుగయ్యేదాకా నాకేసి చూస్తూ చెయ్యూపుతూనే ఉంది.

* * *

రాధలేని ఇల్లు బోసిపోయినట్టనిపంచింది. కొన్నాళ్ళదాకా దాన్ని తలచుకుంటూ ఎంతో బాధపడేదాన్ని. ముఖ్యంగా పనున్నప్పుడు నిమిషానికి లక్షసార్లు జ్ఞాపకానికి వచ్చేది. నేను గంటలో చేసేపని అంది చిటికలో ఎలా చేసేదో నా కర్థమయ్యేది కాదు. ఏది ఏమైతేనేం? అది వెళ్ళిపోయినా, దాని పేరు మాత్రం నా నోటిలోనించి అస్తమానం వస్తూనే వుండేది.

ఒకనాడు మధ్యాహ్నం భోజనంచేసి పుస్తకం చదువుతూ కూర్చున్నాను. రాధపరిగెత్తుకుంటూ వచ్చి నాకాళ్ళమీద పడింది వెక్కివెక్కి ఏడుస్తూ. "ఏమయిందే" అన్నాను కంగారుగా.

జబాబు చెప్పకుండా ఏడుస్తూనే వుంది. నన్ను చూశాక దాని దుఃఖం మరీ ఎక్కువయింది. అయినవాళ్ళను చూస్తే గుండెపగిలి చెరువై వస్తాయేమో కన్నీళ్ళు! దాని హృదయభారం తగ్గేదాకా ఏడవమని ఊరుకున్నాను. ఎందుకో దాన్ని చూస్తుంటే నాకూ ఏడుపొచ్చింది. మనిషి బాగా చిక్కిపోయింది. నల్లబడింది. తలకి నూనెలేదేమో, జుట్టు ఎగిరిపోతోంది, మొహం పీక్కుపోయింది. కాసేపయిన తరువాత రాధ చెప్పిన కథ ఇది :

దాని అత్తగారు పరమ గయ్యాళిట. అరుగురు మరుదులూ, ఒక బావగారు అందరూ దీన్ని సాధింపులేనట. అత్తగారు దీనికి తిండి సరిగా పెట్టదు - సరిగదా గుడ్డలు కూడా సరిగా కట్టుకోనివ్వదు. దీని చీరలన్నీ ఆమె కట్టుకుంటుందిట. దమ్మిడీ దగ్గరుంచరు. వంటంతా చేశాక తినడానికి మిగలదు.

పెళ్ళిలో పుట్టింటివారు పెట్టిన కమ్మలూ, దుద్దులూ కూడా తాకట్టుపెట్టిందట. ఆరోజు కూరలో కొంచెం ఉప్పు ఎక్కువయిందని కొట్టిందట. దుఃఖం పట్టలేక నా దగ్గర కొచ్చేసింది.

"మరి నీ మొగుడు ఏమీ అనడే?" అన్నాను ఏమనాలో తోచక.

"ఆయన భయపడ్తాడు అమంటే. నా కర్మ ఇంకా ఏమన్నా అంటే నన్నే తిడ్తాడు." అంది కళ్ళొత్తుకుంటూ.

కాసేపు దాన్ని ఊరడించి కబుర్లు చెప్పి, భోజనం పెట్టాను. దాని మొహంలో మామూలు నవ్వు కనిపించింది. 'ఏమే! మొగుడితో ఇంగ్లీషు మాట్లాడుతున్నావా?'అన్నాను నవ్వుతూ. దాని మొహంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. "ఆయన కర్థంకాదు" అంది మెల్లిగా, బాధపడ్తున్నట్టుగా.

"పోనీలేవే చక్కగా తెలుగులోనే మాట్లాడుకోండి హాయిగా!" అన్నాను. "మాటాడినట్టే వుంది. ఆయనకు ఏది తెల్వదు. ఎట్లా పనిచేస్తున్నాడో ఏమో? మీ ఇండ్లలోలాగ మమ్మల్ని మాట్లాడుకోనియ్యరు అసలు మావాళ్ళు" అంది నిరుత్సాహంగా రాధ.

అంతవరకు మాములుగా వింటున్న నాకు తలపైన పిడుగుపడ్డట్టనిపించింది. నేనే ఏదో తప్పుచేసినట్టు ఫీలయ్యాను. దానికి చదువుమీద ఆసక్తి కలిగించాను. ఆటల్లో పాటల్లో దానిని మా పిల్లలతో సమానంగా నేనే ప్రోత్సహించాను. నాతో పాటు ఊళ్ళుతిప్పి నేనేది తింటే అది తినిపించాను.

హెచ్చు తగ్గులు, కులమతాలు అనే తేడా వుండకూడదనుకుని ప్రగతి కావాలనికోరుకుంటూ దీన్నయితే చూడగలిగాను గాని, దాని పెద్దల సంగతేమిటి? ఆచారం

సంప్రదాయం పెళ్ళీ అన్ని వారిష్టాలే! వారి అర్హతకు తగ్గవాళ్ళని చూసి పెళ్ళిళ్ళు జరుగుతాయి, జీవితాలు సాగుతాయి. కేవలం జీతం రాళ్ళకోసం నా దగ్గరుంది కాని ప్రగతికోసం కాదుగా'

ఈ ఆలోచన రాగానే తల తిరిగినట్టయింది.

'రాధ మా ఇంటిలో ఉండి ఒక రకమైన సుఖాలనుభవించింది. ఒక రకమైన సంస్కృతకి అలవాటుపడి ఉన్నతంగా బతికాక, మళ్ళీ మామూలుగా వాల్ల ఇంటిలో ఆ పరిస్థితుల్లో ఇమడలేక పోయింది. అందుకే దానికి ఆ బ్రతుకు పంజరంలా అనిపిస్తోంది. మా ఇంట్లో ఉన్న ఆప్యాయత దానికి కరువైపోయింది' ఆలోచిస్తున్న కొద్దీ నేనే తప్పుచేస్తున్నట్టు అనిపించింది.

"కానీ నా దగ్గరున్నప్పుడు దాన్ని నాతో సమానంగా చూడటం తప్పా? నా పిల్లలతో సమానంగా దానికి ప్రేమ పంచడం తప్పా? మానవత్వం ఉండటం తప్పా? ఏది తప్పు? ఈ సమాజం ప్రతి మనిషికీ కూడూ గుడ్డా ఎందుకివ్వదు? ఆ విద్యనెందుకు అంతం చెయ్యదు? అసలు మనిషి మనిషికెందుకు ఊడిగం చెయ్యాలి? ఈ ప్రశ్నలతో బుర్రవేడెక్కి పోయింది.

"పోయొస్తానమ్మా" అంటూ లేచి నిలుచుంది రాథ." జాగ్రత్తగా వుండు రాధా! పరిస్థితులకు తగ్గట్టుగా మసలుకో! నిరుత్సాహ పడకు. నీ కోరికలు నీ బిడ్డలద్వారా తీర్చుకో. వాళ్లని నీ యిష్టమొచ్చినట్టు పెంచుకో. కాని వీళ్ళని మార్చడానికి ప్రయత్నించకు. వాళ్ళు మారరు, వాళ్ళకి అర్థం కాదు కూడా. నీకూ మనశ్శాంతి వుండదు" అన్నాను. "సరే!" అంది నవ్వుతూ. నా మనస్సు తేలిక పడింది. గుండెలమీద బరువు దించినట్టయింది. హాయిగి నిట్టూర్చాను రాధ వెళ్ళిపోయింది.

రాధ చురుకైనది కనుక చూసిన విషయాన్ని ఇట్టే పసిగట్టేసేది. దానిక తగ్గ వరుడు కావాలంటే, వాళ్ల కులంలో, అన్వేషణ కావాలి. ఒకవేళ ఎవరైనా వున్నా, బోలెడు కట్నం కావాలి. ఇతర కులాలలో వారిని చేసుకోరు. ఎలా? ఏది దానికి పరిష్కారం?

మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాను. జవాబు దొరకని ప్రశ్నతో అవస్థపడుతూ మనుషులు మారాలి! కుల మతాల సంకుచిత సంప్రదాయాలనుండి బయట పడాలి! ఎలా సాధ్యం? డబ్బున్నవాళ్ళూ, లేనివాళ్ళూ కూడా ఈ విషయంలో ఒక్కలాగే ప్రవర్తిస్తున్నారు!

"ఇలా ఆలోచనల్లో మునిగిపోయిన నేను ఎప్పుడు నిద్రపోయానో తెలీదు. పిల్లా పాపల్తో రాధ ఆనందంగా వుంది. రాధ పిల్లలు కాన్వెంటులో చదువుతూన్నారు. రాధకి మంచి ఇల్లూ వాకిలీ ఉన్నాయి. రాధ భర్త రాధ దగ్గర తనకి తెలీని విషయాలు నేర్చుకుంటున్నాడు. భర్తలాగా అజమాయిషీ చేస్తూ కాదు, స్నేహితుడి లాగా అభిమానంగా!

* * *